శ్రీ రాచమల్లు
రామకోటేశ్వరరావు

మా పాఠశాలలో కూర్చుంటే పై భాగం తప్ప అష్టదిక్కులందుకొనే ఆకాశం దొరటోల్పి అంచులా కనుపిస్తుంది. మా తలలపై కూడా సూర్యుని చేతులు రూపాయిల్లా, నైజాం పాత అర్ధణాలంతగా వచ్చేసి నాట్యం చేస్తుంటాయి. పాటిదుమ్ముదేవరమాత్రం పావుగంట కోసారిగాని, దయవస్తే యింకా త్వరత్వరగానే అల్లిబల్లిగా ఆడుకొంటూ వచ్చి, మా కండ్లు మూసి, దాగుడుమూతలాడుతుంటుంది. ఒక్కొక్కసారి ఆమెకు కోపం రావడంకూడ సహజమే. అప్పుడామె బడివసారాల్లో పుల్లలన్నింటిని చదువుకోమనిచెప్పి, వాటిని బళ్లోకి రాని పిల్లాణ్ణి లాక్కొచ్చినట్లు తీసుకవచ్చి పుస్తకాలపై పడవేస్తుంది. అప్పటికి పుస్తకాల పైకాగితాలలో వుంటే రసజ్ఞతంతా పిపీలికాకణజాలంతో సహా ఆస్వాదించాల్సిందే! స్కూల్లో యిన్స్పెక్టర్లకైనా జాలి కలుగుతుంది గాని ఈ గుంద్రదేవరకు మాత్రం కనికారమనేది ఏకోశానా లేదు. పని గట్టుకొన్నట్లు విజిట్లపై విజిట్లుచేస్తూ మా తలకాయలను దిమ్మెక్కించడమే ఆ తల్లి ఆదర్శం.

ఈమెకు తోడు మా పాఠశాల గడియారాలు. భుక్తాయాసపు మహిషవాహనంలా పనిచేస్తుంటాయ్. అందులో మా ఉపాధ్యాయుల కళ్లెప్పుడూ వాటిపైనే వుంటాయ్ కాబట్టి, మమ్మ వెక్కిరిస్తున్నట్లు యింకా మందగమనంతో నడుస్తుంటాయి. జిల్లాబోర్డువారు ఇద్దరు ఉపాధ్యాయులకు సరిపడే కొయ్యసామాను సప్లయిచేశారు. క్రొత్తగా స్థాపించబడిన పాఠశాల కాబట్టి, మా ఇద్దరకూ పనికి తరుగులేదు—కాని, వసతి మాత్రం వర్ణించనలవిగాదు. గ్రామస్థులంతా ముందెప్పుడో మంచి యిల్లు కట్టారని వినికిడి—అలానే మేమిద్దరం చేరి ఒక తాటాకా కుండివచ్చి కాలక్షేపం చేస్తున్నాం.

*   *   *

మే మిద్దరం క్రొత్తగా ట్రైనింగు స్కూళ్లనుండి బయటపడ్డవాళ్లం. మెథడ్సు ప్రకారం, టీచింగు చేయడం, సైకలాజికల్, పద్ధతిని అనుసరించడం జరుగుతోంది." కాని మేము స్కూలు ప్రారంభించిన నాటికి పిల్లలవద్ద సుమతి శతకాల్లాంటి పుస్తకాలు, తలా ఒకటి మాత్రమే వున్నాయి. లోగడవాళ్లకు చెప్పిన అయ్యవారు వీనినే క్లాసు బుక్సుగా పెట్టారట. ఈ విషయంగురించి కొందరి తల్లిదండ్రులతో అవి పనికిరావని చెప్పాను. కాని ఎవ్వరూ ఇతర పుస్తకాలు తెప్పించలేదు. ఈ విషయం గురించి కొందరకు అసంతృప్తిగా వున్నదని పిల్లలద్వారా తెలిసింది.

ఇదేమిటంటే 'వీటిలో ఏముంది? ఆవుకు నాలుగు కాళ్లు; కోడికి రెండుకాళ్లు—యింతే వుంటాయ్—యీ పుస్తకాలు చదివితే వున్న తెలివికూడా పోతుంది' అని కొందరంటున్నారు. అయినా యింతవరకు మమ్మల్ని బయటకుపిల్చి ఎవ్వరూ అడుగలేదు.

కాని, సెలవుల విషయం మాత్రం కొందరు ముఖంమీదే అడిగేస్తున్నారు. "శనివారం ఒక పూటేంటండీ? ఆదివారం ఆదివారం సెలవెందుకండీ?" అని ఒకరు—"యిదివరకు చెప్పిన మా ఆచారిగారు ముప్పూటలా చెప్పేవారు. అమాసకు, పున్నానికే గాని సెలవిచ్చేవారుగారు." అని మరొకరు—యిలా అంటుంటే ఏదో సర్ది చెప్పి తప్పుకొంటూ తిరిగేవాళ్లం—.

"అన్నిటికంటే గొప్పవిషయం ఏమిటంటే! చాలామంది గ్రామపెద్దలు జానెడు జానెడు పొరచుట్టల ధూమంతో పాఠశాల సాంతం నింపేవారు. కొందరిని మెల్లగా కదిలించాం. బళ్లో పొగత్రాగరాదని—. కాని, 'ఐతేమాలేండి! యిప్పుడేం పరీచ్ఛ పంతులుగారు రాటంలేదుగా!' అనేవాళ్లు. యిలానే భరిస్తూ జీవయాత్ర సాగిస్తున్నాం.

ఒకనాడు యథాప్రకారంగా మా బడి దినకృత్యాలు నిర్వహిస్తుండగా ఎనిమిదన్నరైంది. ఇంతలో వీరభద్రయ్యగారు వచ్చారు. ఈయన చిన్నప్పుడు నాలుగో తరగతి వరకు చదివాడట. యిప్పుడు వీరికి నలభైఐదు దాటాయనుకొంటాను. కొంచం కటాపిటగా కూట్లాడేమనిషి—

'రాగానే పాఠశాలలో గౌరవంగా కుర్చీమీద కూర్చోపెట్టాను. కూర్చున్న మహాశయుడు కూర్చోక, పక్కజేబులో నుంచి ఆరంగుళాల చుట్టతీసి వెలిగించాడు. అలవాటు ప్రకారం, మర్యాదగా నేను,

"బాబూ! బళ్లో పొగత్రాగరాదండీ?" అన్నాను.

"ఏం! నువ్వు కాల్చటల్లా!"

"నేను బళ్లో కాల్చడం లేదుకదండీ! కనీసం పిల్లలముందైనా కాల్చనే!"

"కాలిస్తే ఏం పోయిందయ్యా! అన్నీ రూల్సుగాని."

"ఎవరైనా ఆఫీసర్లు చూస్తే నా పరువు పోతుంది బాబూ!"

"అంత తెలివి తక్కువోడు ఎవుడు ఈ కాలంలో! అంతలోకే నలిపి పారెయ్యమేం?"

"ఆఫీసర్లు కాకపోయినా అసలు చదువంటే సరస్వతి గదా! అటువంటి సరస్వతి ముందు చుట్టలు కాల్చడం ఎంత పాపంటండీ! అంటే! మీలాంటివారు కొంచం కోపంలేకుండా మెల్లిగా ఆలోచించాలి. అసలు ఎవరైనా కాలుస్తుంటే మీబోటి పెద్దలు కాల్చకుండా ఆపుచేయాలి?..." అని కొంచం నమ్రతగా మాట్లాడాను.

ఇంత మాత్రానికే వీరభద్రయ్యగారు నిజంగా వీరభద్రావతారం ఎత్తారు!

"ఏం! నువ్వేనా పంతులువి? యిటువంటి పంతుళ్లను సాలమందిని చూశా!" అని కుర్చీలో నుంచి లేచాడు.

"చూస్తే చూడొచ్చు బాబూ! కాని నేను మాట్లాడిందాంట్లో ఏం తప్పుందో చెప్పండి?"

"తప్పేంటయ్యా! మా ఆచార్లుగారి బళ్లో కట్టాపోయినా ఏమనేవాడు కాదుగాని, మా నీతులు చెప్పొస్తన్నావేంటయ్యా! మరీ .. మొవగాడిలా."

ఇంతలోనే ఇంకో పెద్దమనిషి ముల్లుగ్రర్రతో పిల్లాణ్ణి బాదుకొంటూ లాక్కొచ్చాడు. వచ్చీ రావడంతోనే—

"ఏం పంతులువయ్యా నీవు? బళ్లోకి పిల్లాడు వచ్చిందీ రాందీ అంతే కనుక్కోవూ? నీకు గౌర్నమెంటు యిచ్చే డబ్బు ఎక్కువైందట్టుందే! అన్నాడు."

నేను ఏదో సంజాయిషీ చెప్పబోయేసరికల్లా వీరభద్రయ్యగారు అందుకొన్నారు.

"గౌర్నమెంటు డబ్బిచ్చేదేంటి

సుబ్బయ్యా! అసలు మనూరొచ్చినోళ్లకల్లా తలదిరుగుద్దిలే! మనూరి నీళ్ళటువంటి యనుకున్నవ్?"

"ఏంజరిగిందిరాయీారబద్దరం?"అన్నాడు సుబ్బయ్య.

"ఏం జరిగిందేంటి? బళ్లోకే రాగూడదంట! సుట్టలు కాల్చగూడదంట! మరీమరీ రూల్సు మాట్లాడతన్నాడు యిందాకణ్ణుంచి"

"అంతదాక వచ్చిందీ! తస్సదియ్య! మా పిల్లాడు యియ్యాల్టికి మూడురోజులు నుంచి బళ్లోకి రాలే! అంతేకనుకోక పోయె! బారెడు పొద్దెక్కాక బడిపెడతాడాయ్! గొడ్డాలకే వదుల్తాడాయ్! మళ్లీ మాపిటెంతల పొంటరకలుకట్టేఏలకు పెడతాడు, గొడ్డు వూళ్లోకి రాకమునుపే వదుల్తాడాయ్! ఏంసదువు — నా బొంద మీద సదువు"

అప్పటికి కొంచం జోక్యం కలిగించుకొని నేను "సుబ్బయ్యగారూ! మీ అబ్బాయికి యింకా పుస్తకాలే కొనిపెట్టలేదు! నన్ను ఏంచెప్పమంటారండీ"—అన్నాను.

"ఏంపుస్తకాలయ్యా! ఆ నరసిమ్మశతకం లేదు. అది చాలదేం? మాకొద్దు బాబు నీ జాగరఫీలు — చరిత్రలు. మాకెందుకు అరకదున్నుకొనేవాళ్లకి. మాకింత నోటు, పత్తరం, కొత్త వుత్తరం ముక్క, చనక్కాయ పద్దులు, యింతమాత్రం రాసుకుంటే చాల్లే!"

దీనికి ఏం జవాబు చెప్పాలో ఆలోచిస్తున్నాను. ఇంతలోనే వీరభద్రంగారు అందుకొనే అందుకొన్నారు—

"ఏం సదువులే సుబ్బయ్యా! మన ఆచార్లుగారే బాగ చెపుతారు. తలోరూపాయేసుకొని, మళ్ళీ ఆయన్నే పెట్టుకొంటే బాగుంటది. మనక్కావలసిన రైతాంగపు చదువు చెప్తాడు. ఇదంతా డబ్బు లేనోళ్లకి — కిరస్తానోళ్లకిగాని, మన రైతాంగానికేమాత్రం కుదురదు—"

ఇంతలోనే ఒకామె పిల్లాణ్ణి చేయి పట్టుకొని, లాక్కొచ్చి—

"ఏడి! ఆపంతులు! ఏంసదువయ్యా! పిల్లాళ్ళకి బయమే లేదాయ్! ఈడి పలక జూడు! ఎట్టపగలగొట్టుకున్నడో! కొని పది రోజులైనా కాదాయ్! మొద్దంటి పలక— ఆ ఆచార్లుగారు చెప్పేటప్పుడు ఇట్టనే చెప్పిండా! ఆయన్ని చూస్తే అందరు గజగజ వణికి నిదర్లోకూడా కలవరించేవోళ్ళు— ఈసదువేందో నాకర్దం గావటల్లా"—అని వుపన్యాసం మొదలుపెట్టింది—

ఇంతలోనే వీరభద్రంగారి వంత అందుకుంది.

"ఈబళ్లో పదేళ్లు సదివినా చనక్కాయ పద్దులైన రాయ్యోలేరేనర్సమ్మక్కా! మనం పదిమందిం కలిసి మళ్ళీ తలా యింతేసుకొని ఆ ఆచార్లుగారినే పెట్టుకొందాం–ఎందుకు పిల్లాణ్ని తీసుకుపో! యెదవసదువు. యిది సదివినాఒకటే! మనం సదువుకోకపోయినా ఒకటే—"

"అయ్యో! కర్మమా. పిటీసన్లమీద పిటీసన్లు రాసి తెప్పించుకొన్న సర్కారుబడికి యిటువంటి పంతుళ్లనేశారేం–యిటువంటి మాయదారోళ్లకి సర్కారు సొమ్ము ఎట్టవంటబట్టుద్దంట" అని మొదలు పెట్టింది నర్సమ్మగారు—

క్రొత్తగా బదిలీఅయిన మా సహోపా

★ కొత్తబడి ★

ధ్యాయుడు యీ వింత చూస్తూ తెల్లబోయి కూర్చున్నాడు. నేనేదన్నా సమాధాన మిద్దామన్నా మూడు రోకళ్లతో వడ్లు దంచి నట్లు ముగ్గురూ ఉపన్యాసా లిస్తున్నారు.

ఇక ఋతిమించి రాగాన పడుతున్నది. ఏమైతే అదే అవుతుందని, కొంచం ధైర్య తెచ్చుకొన్నాను.

"బాబూ! మీమాటలే మీరుగాని, నా ప్రార్థన ఒకటి వినండి. ఇప్పుడు కాలం రోజుకు రోజు ఎలా మారిపోతోందో గమనించారా! చూడండి! దేశం ఏమూల చూచినా నాగరికత రోజుకు రోజు ఎలా మారిపోతోందో!"

"అందుకనే అయ్యా! రెండు చేతుల్తో బువ్వ తింటన్నాం—"అని వీరభద్రంగారు కళ్ళెర్రజేశారు!

"నామాట కొంచం వినండి బాబూ! ఈనాడు ఏదేశంలో ప్రజలు ఎలా జీవిస్తున్నారో! మనం అభివృద్ధిలోకి ఎలా రావాలో! దేశంలో ఎలా మసలుకోవాలో! ఏది మంచో, ఏది చెడో, తెలుసుకోవాలంటే, చదువుకంటె ముందు విజ్ఞానం అవసరం—చూడండి! బంగారం వున్నదంటే దానిని రకరకాల సొమ్ములుగా తయారు చేయ్యొచ్చు. ఈ మాసిద్ధాంతంప్రకారం పిల్లలకు చదువు చెప్పామంటే ఒక శనక్కాయ పద్ధులే కాదు. ఏ లెక్కైనా, ఏ ఉత్తర మైనా, ఏ పేపరైనా, చదివి, అందరికి తెలిసేటట్లు చెప్పగలుగుతారు"అని కొంచం ఉపన్యాసధోరణిలో మాట్లాడాను. వీరభద్రంగారు ఎట్లున్నా మిగతా యిద్దరు కొంచం చల్లబడ్డారు. ఇది గ్రహించి "వీరభద్రయ్యగారూ! చూడండి. మీరు చిన్నప్పుడు కొంతవరకు చదివారుకదా! ఇప్పుడు మీకు ఎంతవరకు జ్ఞాపక మున్నదండీ" అన్నాను.

"ఏం! నాయింటికి కావలసినవరకు నాకు బాగానే జ్ఞాపకం వుంది" అన్నాడు.

"అయితే చూడండి. యీ చిన్న లెఖ్ఖ చేసిపెట్టండీ. యిద్ద రన్నదమ్ములు. ఒక రూపాయిపంచుకొన్నారు. పంచుకోడంలో అన్నకు అణా ఎక్కువొచ్చింది. తమ్మునకు అణా తక్కువచ్చింది. చెప్పండి. ఇద్దరికీ ఎంతెంత వచ్చిందో?"

కొంచం ఆలోచించి "పెద్దోడికి తొమ్మిదణాలు, చిన్నోడికిఏణ్ణాలు. యింతమాత్రం లెఖ్ఖ రాదనుకున్నావా!" అన్నాడు.

"కాదండీ...అన్నాను.

"ఎట్టనయ్యా. చెరర్ధ పంచుకొంటే ఒకణా పెద్దోడికి స్తే ఆడికి తొమ్మిది, ఈడి కేడు. నన్నేదో మా డొంగు పుచ్చుతున్నావే—"అన్నాడు.

"అదికాదండీ. చూడండి. రూపాయిలో ముందు అణా పెద్దవాడికి యివ్వండి, ఇంకెంతుంది...పదిహేనణాలు. చెరిసగం పంచండి. చెరి ఏడణాలన్నర. పెద్దవాడికి అణా కలిసిందిగా! అంటే అతనికి అర్ధరూపాయి అర్ధణా, చిన్నవాడికి ఏడణాలన్నర. అంతేనా! అణాయేగా ఎక్కువచ్చింది! మీరు చెప్పిన లెక్కప్రకారం బేడా ఎక్కువొచ్చింది" అన్నాను.

నివ్వెరపోయాడు పాపం! కొంచం తగ్గాడు. కాని ముఖాన్నిబట్టి చూస్తే! లోపల ఈర్ష్యతో మండుకుపోతున్నట్లు కనిపిస్తుంది. ఇది గ్రహించి, మళ్ళీ మొదలు పెట్టాను.

"చూడండి వీరభద్రయ్యగారూ! విజ్ఞానమంటే ఒక్క లెఖ్ఖల్లోనే కాదు. ప్రతిదాంట్లో వుంటుంది. పూర్వం చదువుకు యిప్పటి చదువుకు గజమశకం తేడావుంది. అంటే పూర్వపుచదువు చెడ్డదనటల్లా? కాని పద్ధతులుమాత్రం వేరు. పూర్వం పంతుళ్లు పిల్లలను కొరడాలతో కొట్టేవాళ్లు. ఇప్పుడు చూడండి. ఆటలద్వారానే నేర్పమంటున్నారు గవర్నమెంటు. మీరు నాయందు దయయుంచి, నే చెప్పినట్లు మీ పిల్లలకు పుస్తకాలు తెప్పించి శ్రద్ధగా చదివించండి. ఒక నెలలోనే గ్రహిస్తారు. తర్వాత మీపిల్లలు అభివృద్ధికి రాకపోతే మీ రన్నిమాటలన్నా పడతాను. ఎవరైనా మంచికోసం పాటుబడి మంచి అలవాట్లు, గౌరవం, మర్యాద, సంపాదించాలి" అని చెప్పేసరికి చల్లబడి మెల్లిగా బయలుదేరి వెళ్లారు.

మా అసిస్టెంటు టీచరు "హమ్మ!"... అని..."మాస్టారూ! ఈవూళ్ళో పిల్లలకంటే పెద్దలకే టీచింగు చేయాలండీ..." అన్నారు...

బుర్ర వేడెక్కి ఆలోచిస్తున్నా! ఇంతలోనే సైకిలుమీద మా పరీక్షాధికారి నురుగులు గ్రక్కుకుంటూ వచ్చాడు. గౌరవపూర్వకంగా స్వాగతంయిచ్చాము. కొంచం మంచినీళ్ల ఉపశమనం అయ్యాక...రికార్డు అంతా చూసి, "పిల్లలకు అన్ని క్లాసు పుస్తకాలున్నాయా" అన్నారు.

నాకు నవ్వాలో — ఏడ్వాలో కూడా తెలియలేదు — అన్నీ చూసి ఇన్‌స్పెక్షన్ పుస్తకం పైకి తమకలాన్ని పోనిచ్చి,

"బడివసతి అనుకూలంగా లేదు, పిల్లలకు క్లాసుపుస్తకాలు లేవు..............." అని వ్రాశారు. టైంఐంది! బెల్ కొట్టాను. పిల్లలందరూ రాతిమీద కొట్టిన సీసా పెంకులల్లే పరుగెత్తారు. పరీక్షాధికారికి వీడ్కోలిచ్చి, మేమిద్దరం బయలుదేరాం — ... మా రమణీయ స్వయంపాకసాధాలకు...★

కేశవర్ధని అ. 14; షాంపూ అ. 14 అందరు డీలర్లవద్ద లభిస్తాయి.
లేక సౌత్ ఇండియా కెమికల్స్, క్రాస్‌కట్ రోడ్, కోయంబత్తూరుకు వ్రాయండి.